## క్లుప్తంగా

### ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించాలి



**వనపర్తి రూరల్:** పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో సోమవారం ఎంపీడీఓ రవీంద్ర ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఇళ్లకు మార్కింగ్ ఇచ్చి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. మిగిలిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఇంటి నిర్మాణం పూర్తి బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మల్లయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్యాంసుందర్‌గౌడ్, రాజేష్, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### మహిళల అభ్యున్నతే లక్ష్యం



**మదనాపురం:** మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఇటీవల కొత్తగా ఎన్నికైన మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారులు, సంఘం మహిళలకు నిర్వహణ, కట్టుబాట్లను వివరిస్తూ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ చల్లా గాయత్రి, ఫర్జానాలు ప్రభుత్వ పథకాలు మహిళల అభ్యున్నతి అనే అంశాలతో అవగాహన కల్పించారు.

### కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు



**మదనాపురం:** మండలంలోని నర్సింగాపురంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ మట్లాడుతూ కార్యకర్తలు సమష్టిగా ఉండి త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు గెలుచుకోవాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు.

### రుణాలు అందజేత



**వనపర్తి రూరల్:** ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో రాజనగరం సింగిల్ విండో ద్వారా దీర్ఘకాలిక రుణాల్లో భాగంగా రైతు మిత్ర కింద అన్నదాతలకు రూ 1.10కోట్లు రుణం ఇచ్చినట్లు చైర్మన్ రఘువర్ధన్‌రెడ్డి తెలిపారు.

### బీసీ రిజర్వేషన్‌పై స్పష్టత ఇవ్వాలి



**కొత్తకోట రూరల్:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ గానికాడి రాములు ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసిందని, దానికి కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాంగీర్, నజీర్, హోటల్ కురుమూర్తి, వెంకటన్నగౌడ్, తిరుపతయ్యగౌడ్, రాంచంద్రయ్య, ఊశన్న తదితరులు ఉన్నారు.

# కలగానే బీటీరోడ్డు నిర్మాణం

- కంకర రోడ్డుపై వాహనదారులకు చుక్కలు
- అదుపు తప్పి గాయాలపాలవుతున్న బైకర్లు



రాళ్లు తేలిన రోడ్డుపై ద్విచక్ర వాహనదారుడి ప్రయాణం



కంకర పరిచిన బీమ్లానాయక్‌తండా రోడ్డు

**చిన్నంబావి:** మండలంలోని పలు రోడ్లు ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో గతుకులమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లకు నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించారు. అనంతరం ఎన్నికలు వచ్చి ప్రభుత్వాలు మారడంతో రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి.

**ఏళ్లుగా అడియాసలు...**

మండలంలో భీమ్లానాయక్‌తండా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఈ తండాకు ఇప్పటి వరకు పల్లెవెలుగు బస్సు ఎరగని గ్రామంగా ఉంది. కనీసం ఇతర గ్రామాలకు వేళ్లేందుకు ప్రధానంగా కావాల్సిన రోడ్డు కూడా సక్రమంగా లేదు. దీంతో అత్యవసర సమయాల్లో ఇతర గ్రామాలు, పట్టణాలకు వెళ్లే గ్రామస్తుల బాధలు వర్ణనాతీతం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అనంతరం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నెమ్మదిగా సాగడం, అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ రోడ్డు కలగానే మిగిలిపోయింది.

**మట్టి రోడ్డే..**

పెబ్బేరు–కొల్లాపూర్ ప్రధాన రోడ్డు నుంచి బీమ్లానాయక్‌తండాకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డే దిక్కు. ఆ తండా మీదుగా బెక్కెం గ్రామానికి వెళ్తుంటారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం మట్టి రోడ్డును తవ్వి కంకర పరిచి వదిలేయడంలో ఆ రోడ్డుపై వెళ్లేవారికి అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కళ్లలో దుమ్ము పడడం, కంకరపై ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పలువురు కింద పడి తీవ్ర గాయాలయిన ఘటనలు ఉన్నాయి.

### రోడ్డు నిర్మించాలి

మండలంలోని బీమ్లానాయక్‌తండాకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. కంకర పరచిన రోడ్డుపై వాహనం అదుపు తప్పి కింద పడుతున్నారు. దీనికి తోడు ఏదైనా పెద్ద వాహనం పోయినప్పుడు దుమ్ము లేస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోయినా కనీసం రోడ్డు నిర్మాణం అయిన పూర్తి చేయాలి.

– కిరణ్‌కుమార్, చిన్నంబావి

### మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

ఇటీవల మండలంలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి రోడ్డు నిర్మాణం విషయం గ్రామస్తులు ప్రస్తావించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేస్తాం అన్నారు. మరోమారు బీటీ రోడ్డు నిర్మాణం గురించి మంత్రికి వివరిస్తాం.

– రమణరావు, ఎంపీడీఓ

# ‘రైతుభరోసా’ రాని రైతుల ఆందోళన

- రైతువేదికకు బారులు తీరిన అన్నదాతలు



వివరాలు తెలుసుకుంటున్న రైతు భరోసా జమకాని రైతులు

**పాన్‌గల్:** మండలంలోని చాలా మంది రైతులకు రైతుభరోసా అందక ఇక్కట్లు పడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికకు చేరుకొని తమ పట్టాదారు పాసుపుస్తకాలను చూపుతూ తమకు ఎందుకు రైతుభరోసా పడలేదని వ్యవసాయ అధికారులను నిలదీస్తున్నారు. చాలా మంది రైతులకు తమ భూ విస్తీర్ణం కన్నా తక్కువగా నిధులు ఖాతాలో జమవుతున్నాయని, ఇంకొంత మంది రైతులకు మొత్తానికే డబ్బులు జమ కాలేదనే ఫిర్యాదులు అధికారులకు అందుతున్నాయి. ఈ విషయంపై ఏఓ రాజవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా ఇప్పటి వరకు మండలంలో 9 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 17,152 మందికి రూ.18.58 కోట్లు జమ అయినట్లు ఆయన పేర్కొన్నారు. కొంత మంది రైతులకు టెక్నికల్ సమస్యలతో నిధులు జమ కాలేదని, ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించామన్నారు.

# టీచర్ల డిప్యూటేషన్లు రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**పెద్దమందడి:** డిప్యూటేషన్ల పేరుతో కొందరు టీచర్లను ఇతర ప్రాంతాలకు పంపాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం ఆది విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మండలంలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటం వల్ల సకాలంలో విద్య అందకపోవడంతో నష్టపోతున్న విద్యార్థులకు అదనపు ఉపాధ్యాయులను నియమించకపోగా.. ఉన్నవారిని ఇతర ప్రాంతాలకు పంపాలని చూడటం సరైన చర్య కాదని మండిపడ్డారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వరలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రామకృష్ణ, నవీన్, డీవైఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, ఈశ్వర్, ప్రజా సంఘాల నాయకులు ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, వెంకటయ్య, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

**పాన్‌గల్:** దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సమ్మెలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జీపీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ గోవింద్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ.. కార్మిక వర్గాలు అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లోని 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి, వాటిని అమలు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని కార్మికులకు నష్టం కలిగే చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు, కార్మికులకు గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు అందించాలని, జీవో 51ను సవరణ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటూ జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నాగన్న, మండల అధ్యక్షులు సుగ్రీవుడు, మండల కమిటీ నాయకులు అర్జునయ్య, గోపాల్, రాజారెడ్డి, చందూ, వెంకటయ్య, శాంతమ్మ, మద్దిలేటి, కురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ‘అణగారిన వర్గాల కోసం పనిచేస్తాం’



మాట్లాడుతున్న జంగయ్య

**పెద్దమందడి:** రాష్ట్రంలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ మాదిగల కోసమే కాకుండా అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం పనిచేస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య, జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటి హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో పసిపిల్లల ఆపరేషన్ల కోసం మందకృష్ణ మాదిగ ఎన్నో ఉద్యమాలను నిర్వహించారన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు కాకపోవడం వల్లే మాదిగలు ఆర్థికంగా వెనుకబడ్డారని వారు అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఐక్యతను చాటేందుకు జులై 7న మాదిగల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పేందుకు అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, సహదేవుడు, శ్రీను, రాముడు, రాజు, రవివర్మ, విష్ణు, గంగూలీ, సహదేవుడు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల కోసమే కాంగ్రెస్ డ్రామాలు



శాఖాపూర్‌లో మాట్లాడుతున్న వనం రాములు

**వనపర్తి రూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అరకొర పథకాలు ప్రారంభిస్తూ ప్రజలను మరోసారి మోసం చేస్తుందని బీఆర్ఎస్ పెబ్బేరు మండల అధ్యక్షుడు వనం రాములు విమర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి, వైశాఖాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని వారికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కర్రెస్వామి, పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్, ఈశ్వర్, రామచంద్రారెడ్డి, మదు, మొగిలయ్య, ధర్మారెడ్డి, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి**

**ఖిల్లాఘనపురం:** మోసపూరిత హామీలు ఇచ్చి రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు బాలీశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. మండలంలోని రుక్కన్నపల్లి, కోతులకుంటతండా, సోళీపురం, షాపురం తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలను చైతన్యం చేసేందుకు సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి అత్యధిక స్థానాల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పురేందర్‌రెడ్డి, నరేష్‌నాయక్, మన్యంగౌడ్, సురేందర్, కరీం పాషా, అంజనేయులు, రంజిత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకే కవాతు



ఖిల్లాఘనపురంలో కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్



పెబ్బేరులో..

**వనపర్తి రూరల్:** ప్రజలకు రక్షణపై భరోసా ఇవ్వడం కోసం పెబ్బేరు పట్టణ కేంద్రంలో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి స్థానిక ఎస్ఐ యుగేంధర్‌రెడ్డి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ముందస్తుగా పరేడ్ నిర్వహిస్తున్నామన్నారు.

**ఖిల్లాఘనపురం:** సమాజంలో శాంతి పరిరక్షణ కోసమే సైన్యంతో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కవాతు నిర్వహిస్తున్నామని ఎస్ఐ సురేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఖిల్లాఘనపురంలో ఆర్ఏఎఫ్ సిబ్బంది 45 మందితో గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ ప్రజలకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## అమరచింతలో ఫుడ్ ఫెస్టివల్

**అమరచింత:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ మహిళా సమాఖ్య సంఘాల సభ్యులతో పాటు మహిళా సంఘం ద్వారా రుణాలు తీసుకుని చిరువ్యాపారాలు చేస్తున్న మహిళలు వివిధ రకాలు వంటకాలను ప్రదర్శించారు. వంటకాల రుచులను పరిశీలించిన అధికారులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణ సమాఖ్య చేస్తున్న వివిధ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మెప్మా కోఆర్డినేటర్ యువరాజు, మున్సిపల్ మెనేజర్ యూసుఫ్, ఆర్పీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**చిన్నంబావి:** మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు, నిషేధిత భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ హెచ్చరించారు. ఆయన మండలంలోని వెలగొండలో చెరువు శిఖంలోని భూమి ఆక్రమించుకొని గుంతలను తవ్వడంతో వాటిని రెవెన్యూ, పోలీస్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో వాటిని పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు నుంచి నీటిని మాత్రం నిబంధనల మేరకు వాడుకోవాలని, ఎవరి వ్యక్తిగతంగా వారు వినియోగించుకోవడానికి వీలు లేదన్నారు. చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు.

# 29న సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ



అమరచింతలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న రజనీసాయిచంద్

**అమరచింత/ఆత్మకూర్:** అమరచింత పట్టణంలో ఏర్పాటు చేసిన సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణకు ఈనెల 29న మాజీ మంత్రులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు వస్తున్నారని గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనిసాయిచంద్ తెలిపారు. ఈ మేరకు సాయిచంద్ విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ సాయిచంద్ అమరచింతలో పుట్టి తన గానంతో యావత్తు తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాడని, దేశ, విదేశాల్లో పాలమూరు ప్రజల వాణి వినిపించిన వ్యక్తిగా చరిత్రలో మిగిలి పోయాడని గుర్తు చేసుకున్నారు. విగ్రహ ఆవిష్కరణకు రాష్ట్ర నలుమూలల నుంచి సాయి అభిమానులు, గాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొంటున్నారని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, రాజేందర్‌సింగ్, లెనిన్, ఎస్ఏ రాజు, నాగభూషణంగౌడ్, డీజే శేఖర్, రవికుమార్‌యాదవ్, బంగారు శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మండ్ల రామకృష్ణ, రియాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# ‘బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి చెరిపేస్తే చెరగదు’



మాట్లాడుతున్న గట్టుయాదవ్

**వనపర్తి విద్యావిభాగం:** జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను చెరిపేయడం ఎవరితరం కాదని, నిధులు ఉండి టెండర్ పూర్తయిన బైపాస్ రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించడం లేదో స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన బైపాస్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో పెరుగుతున్న జనాభాకు భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకూడదని ఒక బృహత్తర ప్రణాళికతో రోడ్ల విస్తరణ చేపట్టిన ఘనత మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కిందన్నారు. బైపాస్ నిర్మాణానికి రాజపేట శివారు నుంచి పాన్‌గల్ శివారు వరకు అర్ధచంద్రాకారంలో శ్రీకారం చుట్టారన్నారు. అక్టోబర్ 3, 2022 నాడు జీఓఆర్‌టీ నం366 ద్వారా రూ.73 కోట్లు మంజూరు చేయించి అక్టోబర్ 9, 2023 న టెండర్ పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశములో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, నందిమల్ల రమేష్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**మదనాపురం:** గ్రామాల్లో పని చేస్తున్న ఆశావర్కర్లను ప్రభుత్వం మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ భవానీకి జులై 9న సమ్మెలో పాల్గొంటామని ఆశాలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, అధ్యక్షురాలు అనసూయ, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి నీలమ్మ, సహాయ కార్యదర్శి లక్ష్మి, కోశాధికారి గంగ, సభ్యులు సుజాత, బుచ్చమ్మ, యశోద చెన్నమ్మ, గౌరి, భాగ్యలక్ష్మి, పద్మ, స్వప్న, స్వాతి పాల్గొన్నారు.

## 26న జాబ్ మేళా

**ఆత్మకూర్:** నిరుద్యోగులు అప్రెంటిషిప్ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి, ఒకేషనల్ సీనియర్ అధ్యాపకుడు విశ్వేశ్వర్ కోరారు. ఇంటర్ విద్యాధికారి అంజయ్య ఆదేశాల మేరకు 2023, 24, 25 సంవత్సరంలో ఒకేషనల్ గ్రూప్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 2025–26 సంవత్సరాలకు గాను అప్రెంటిషిప్, జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు బయోడేటాతో ఈ నెల 26న మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో హాజరు కావాలని కోరారు.

# శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



కొత్తకోట చౌరస్తాలో ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

**సాక్షి, నెట్‌వర్క్:** డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాస్ దివాస్ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖర్జీ జనసంఘ్‌ను స్థాపించి దేశంలోనే తొలి హిందూవాద రాజకీయ పార్టీకి పురుడు పోశారని కొనియాడారు.

- కొత్తకోట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ మోర్చ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, నరసింహ, రాజమౌళి, రాఘవేంద్రరెడ్డి, చిన్న, అమరేందర్‌రెడ్డి, తిరుపతిసాగర్, రఘు నాగరాజు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.
- వనపర్తి మండలంలోని కడుకుంట్ల, కిష్టగిరి, మెంటేపల్లి గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో, పెబ్బేరు పట్టణ కేంద్రంలోని శుభాష్‌చౌరస్తాలో పట్టణ అధ్యక్షుడు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శిరీష, తిరుమలయ్య, యాదగిరి, అంజి, సంతోష్‌కుమార్, విష్ణు, సోమన్న, నాగరాజు, అశోక్, కంచె ఆంజనేయులు, రామకృష్ణ, రమేష్, సర్వేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం మండలంలోని మామిడిమాడలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, రవీంద్రాచారి, భద్రయ్య, దశరథ్, గోపాల్‌రెడ్డి, ఆశన్న, శంకర్‌నాయక్, చక్రవర్తిగౌడ్, మహేష్, అంజనేయులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**వనపర్తి రూరల్:** గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా ప్రతినిధి బృందం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్‌సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ ఘనపురం మండలంలోని మామిడిమాడ, షాపూర్ గ్రామాల రెవెన్యూ శివార్లలో సర్వేనెం 369 నుంచి 414 వరకు గల భూములు 463 ఎకరాలు, 76, 80, 92, 103 సర్వే నంబర్లలో 35 ఎకరాల 20 గుంటల భూమి మొత్తం 8 గిరిజనతండాల పేద గిరిజన రైతులు ఐదు తరాల నుంచి సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని వాపోయారు. వారికి చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు బాల్యనాయక్ పాల్గొన్నారు.